క్లుప్తంగా

వ్యాధిగ్రస్తుడికి భరోసా



అరుదైన వ్యాధితో బాధపడుతున్న యువకుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఆల్తిపాలెం గ్రామంలో అరుదైన వ్యాధితో బాధపడుతున్న యువకుడు వాల్లె అబద్ధంను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మంగళవారం పరామర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా, గ్రామ పెద్దల వినతి మేరకు యువకుడి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ యువకుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అరుదైన జీబీ సిండ్రోమ్ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకొని, సీఎం రిలీఫ్ ఫండ్ వర్తించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మెన్ చనమల్లు వెంకటరమణమ సర్పంచ్ పప్పల భాస్కరరావు పాల్గొన్నారు.

డీ వార్మింగ్ పోస్టర్ల విడుదల



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: మండల పరిధిలో నులి పురుగుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో గంటా వెంకటరావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో డీ వార్మింగ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పాఠశాలలకు వెళ్లి నులి పురుగుల నివారణ టాబ్లెట్‌లను విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి మోపాడు జగదీష్, ఈవోపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద రాస్తారోకో చేస్తున్న వీఆర్‌ఏలు

విజయనగరం ఫూల్‌బాగ్: తెలంగాణ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా వీఆర్‌ఏలకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద రాస్తారోకో చేశారు. అనంతరం డీఆర్‌వో గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి, జిల్లా కార్యదర్శి జి.వెంకన్న, రాంబాబు, బద్రి, చంద్రరావు, భవానీ, రూప, ఆదినారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

12న నిత్య దైవనామస్మరణ సేవా సమితి వార్షికోత్సవం

విజయనగరం టౌన్: నిత్యదైవ నామస్మరణ సేవా సమితి 14వ వార్షికోత్సవం ఈ నెల 12న శనివారం ఉదయం 10 గంటలకు ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమితి వ్యవస్థాపకులు నారాయణ స్వామీజీ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి ఎమ్.గణపతిరావు హాజరు కానున్నారన్నారు. సమితి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సైకిల్ యాత్రకు ఘన స్వాగతం

విజయనగరం ఫూల్‌బాగ్: ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంగ్రామ యాత్ర మంగళవారం విజయనగరం పట్టణానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో కోట వద్ద సీఐటీయూ, ఐద్వా, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్ రావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఐద్వా నాయకురాలు పి.రమణమ్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, బి.రమణ, బి.సుధారాణి, బి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

సాలిపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

విజయనగరం: నగరంలోని 39వ డివిజన్ సాలిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, డాక్టర్ వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం ఉందన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతుందన్నారు. కార్పొరేటర్ వింత ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోపై విజిలెన్స్ దాడులు

కొత్తవలస: మండలంలోని ఉత్తరాపల్లి గ్రామం రేషన్ డిపో-1పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. రికార్డుల ప్రకారం డిపోలో ఉండాల్సిన సరుకుల కంటే 16 క్వింటాళ్ల బియ్యం, రెండు క్వింటాళ్ల పంచదార తక్కువ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. డిపో డీలర్ బండ రామయ్యమ్మపై 6-ఏ కేసు నమోదు చేశామని సీఎస్‌డీటీ కె.ఇందిర తెలిపారు. డిపోలో ఉన్న సరుకులను నిమ్మలపాలెం గ్రామానికి చెందిన డిపో నంబర్-16కు అప్పజెప్పినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక అసమానతలు తగ్గించడమే లక్ష్యం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



19వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఆర్థిక అసమానతలను తగ్గించటమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పని చేస్తుందని ఏపీ శాసనసభ డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 19వ డివిజన్ లంకాపట్నం జంక్షన్ నుండి మంగళవారం ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. లంకాపట్నం చేరుకున్న ఆయనకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించారు. మహిళలు హారతులు పట్టి కుంకుమ తిలకాలను దిద్దారు. అనంతరం ఇంటింటికి వెళ్లిన డిప్యూటీ స్పీకర్ ప్రభుత్వ పథకాలను వివరిస్తూనే, స్థానిక సమస్యలపైన ఆరా తీశారు. గత నాలుగేళ్ల మూడు నెలల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన బుక్‌లెట్లను అందజేశారు. సామాజిక సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పొట్నూరు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ పొట్నూరు పద్మ మాట్లాడుతూ తమ డివిజన్‌లో ఇప్పటివరకు రూ. కోటి 40 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానికంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అందిస్తూ ప్రజలకు మరింత చేరువవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌రావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ ఎస్.బంగారు నాయుడు, పొట్నూరు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై దుష్ప్రచారం

- ఓర్వలేకే కోలగట్లపై విమర్శలు
- ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పేందుకు సిద్ధం
- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి కనకల కృష్ణ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి కనకల కృష్ణ

విజయనగరం: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ.. ప్రభుత్వంపైన, తమ నాయకుడు కోలగట్ల వీరభద్రస్వామిపైన ప్రతిపక్షాలు ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి కనకల కృష్ణ అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి లేదంటూ దుష్ప్రచారానికి దిగుతున్నాయని తెలిపారు. వీటిని తిప్పికొట్టేందుకు సోషల్ మీడియా విభాగం సిద్ధంగా ఉందని చెప్పారు. ఉప సభాపతి కోలగట్ల నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి లేదంటూ బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్షాలు తమతో పాటు నగరంలోని 50 డివిజన్లకు, మండలంలోని పంచాయతీలకు రావాలని సవాల్ విసిరారు. ఒకవేళ ఎక్కడైనా వారి దృష్టిలో అభివృద్ధి లేనట్టుగా అనిపించినా సమస్య ఏమిటో తమ నాయకుడు కోలగట్ల దృష్టికి తీసుకురావచ్చునని, వెను వెంటనే పరిష్కరిస్తారని అన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే తిరుగుతూ, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న తమ నాయకుడిపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడానికి తమ సోషల్ మీడియా సైన్యం సిద్ధంగా ఉందన్నారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర ఇన్‌చార్జి కనిసెట్టి సుధ, మండల ఇన్‌చార్జి ఆర్.వెంకటేష్, నియోజకవర్గ కో కన్వీనర్లు అయ్యప్ప అమర, సైలాడ హరిబాబు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవనోపాధుల మెరుగుకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం జయశ్రీ

దెంకాడ: పొదుపు సంఘాల మహిళలు పొదుపు సంఘం ద్వారా తీసుకుంటున్న రుణాలతో స్వయం ఉపాధిని ఏర్పరచుకుని, జీవనోపాధి మెరుగుకు కృషి చేయాలని డీపీఎం ఎల్‌హెచ్ ఎం.జయశ్రీ అన్నారు. మండల వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం మంగళవారం జరిగింది. దీనిలో డీపీఎం జయశ్రీ,, విజయనగరం ఏరియా కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఏపీఎం(హెచ్‌డీ) గీత తదితరులు మాట్లాడారు. పొదుపు సంఘాల సభ్యులు తమ పొదుపును పెంచాలన్నారు. పొదుపు సంఘాల మహిళలు వారికి అనుకూలంగా, అనువుగా ఉండే చిన్నచిన్న వ్యాపారాలు చేయడం వలన ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని వివరించారు. ఆర్థిక లావాదేవీలు చక్కగా నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. బాల్య వివాహాలు నేరమని, దీంతో అన్ని విధాలుగా నష్టం జరుగుతుందన్నారు. అనంతరం మండల సమాఖ్య మహిళలతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శివకుమార్, ఏపీఎం విజయలక్ష్మి, ఎఫ్‌పీవో, ఏపీవో, సీసీలు పాల్గొన్నారు.

మూర్తి మృతి ప్రేమ సమాజానికి తీరని లోటు



డాక్టర్ మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రేమ సమాజం ప్రతినిధులు

విజయనగరం టౌన్: ప్రముఖ వైద్యులు, సంఘ సేవకులు డాక్టర్ బిఎస్ఆర్.మూర్తి మృతి ప్రేమ సమాజానికి తీరని లోటని ఆ సంస్థ కార్యదర్శి పెద్దింటి అప్పారావు పేర్కొన్నారు. ప్రేమ సమాజం కార్యాలయంలో మూర్తి సంతాప సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ సమాజం అభివృద్ధికి మూర్తి విశేషంగా కృషి చేశారన్నారు. తాగునీటి ప్లాంట్, భవనాలు ఆధునీకరణ, నూతన భవన నిర్మాణాలు, వయోశ్రేష్టులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆయన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రేమ సమాజం ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాజు, కోశాధికారి బలివాడ అప్పారావు, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శ పి.సత్యం అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో ప్రథమ చికిత్స కోసం మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రథమ చికిత్సపై అవగాహన ఉండడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు కాపాడడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ వైద్యులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి పాము కరిచినప్పుడు, రోడ్డు ప్రమాదంలో గాయపడినప్పుడు, అగ్ని ప్రమాదంలో గాయపడినప్పుడు, గుండె పోటు వచ్చినప్పుడు ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలో ప్రయోగ పూర్వకంగా చేసి చూపించారు. శిక్షణలో రమణ, గౌరీశంకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రకటన విడుదల



పూసపాటిరేగ: ఎన్నికల నోటీసును విడుదల చేస్తున్న రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల పంచాయతీలో ఖాళీ అయిన సర్పంచ్ స్థానానికి సంబంధించి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను పంచాయతీ రిటర్నింగ్ అధికారి డి. శ్రీనివాసరావు మంగళవారం పంచాయతీ నోటీసు బోర్డులో అతికించారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ, 11న పరిశీలన, 12న నామినేషన్లపై అప్పీలుకు అవకాశం, 13న అప్పీలు అధికారి నిర్ణయం, 14 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 14న ఎన్నికలలో పోటీలో వున్న అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు చేయనున్నారు. ఈ నెల 19న ఉదయం 7 గంటల నుండి 1 గంట వరకు ఎన్నికలు, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు జరపడానికి ఎన్నికలు కమిషన్ నుండి ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి ఉమా, అసిస్టెంటు ఎన్నికల అధికారి గేదెల శంకర్రావు తదితరులు వున్నారు.

వార్డు సభ్యుని ఎన్నికకు..

దెంకాడ: మండలంలోని డి.తాళ్లవలస పంచాయతీలోని 7వ వార్డు సభ్యుడి ఎన్నికకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. 7వ వార్డు మెంబర్ ఖాళీ కావడంతో ఎన్నిక నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 8వ తదీ నుంచి 10వ తేదీ వరకూ ఎన్నికల నామినేషన్లు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఆర్‌వోగా ఎంఈవో-2 రాధాకృష్ణ, ఏఆర్‌వోగా రాంబాబు వ్యవహరిస్తున్నట్టు చెప్పారు.

పక్కాగా వ్యాక్సినేషన్

- కమిషనర్ బాలాజీప్రసాద్



వైద్యారోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల రూరల్: చిన్నారులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కమిషనర్ బాలాజీప్రసాద్ సూచించారు. నగర పంచాయతీ కార్యాలయంలో మిషన్ ఇంద్రధనస్సుపై వైద్యారోగ్య సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అమలవుతున్న ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా 5 సంవత్సరాల పిల్లలకు మీజిల్స్, రూబెల్లా తదితర టీకాలు వేయాలన్నారు. మూడు దశల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని శతశాతం పూర్తి చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేసిన తరువాత యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

12న ఫ్యాప్టో 12 గంటల ధర్నా



ఐక్య నినాదంతో ఫ్యాప్టో జిల్లా కమిటీ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న చర్యలను మానుకోవాలనే డిమాండ్‌తో స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఈ నెల 12న 12 గంటల పాటు నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక (ఫ్యాప్టో) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ప్రతినిధులు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వైఖరి మార్చుకోవాలని, పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న జీఓ నెం 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూన్‌లో బదిలీ, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ సీహెచ్ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డి.ఈశ్వరరావు, జె.రమేష్‌పట్నాయిక్, జేఏపీఆర్‌కే ఈశ్వరరావు, షేక్ బుకారీబాబు, డి.శ్యామ్, శ్రీనివాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

నెల్లిమర్ల రూరల్: తపాలా శాఖ అందజేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్ఎన్ రాజు, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కోరారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తపాల శాఖ సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు తపాలా సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో అన్ని గ్రామాల్లోనూ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. తపాల బీమా, సుకన్య సమృద్ధి యోజన, ఎస్‌బీ, ఆర్డీ, పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ తదితర పథకాలపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఖాతాదారులకు సంతృప్తికర సేవలు అందించి వారి మన్ననలు పొందాలన్నారు. తపాలా కార్యాలయాల ద్వారా ప్రజలకు నిరంతరాయ సేవలు అందజేస్తున్నామని, సబ్ పోస్టాఫీస్ కార్యాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో, సబ్ పోస్ట్ మాస్టర్లు ఎర్రయ్య, రమణ, సుధ, మధు, గ్రామీణ శాఖ పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 'సంక్షేమ' రాజ్యం



ఏటీ అగ్రహారంలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- మూడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం
- హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో అవినీతికి తావు లేకుండా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఏటీ అగ్రహారం, తమ్మాపురం, ఆల్తిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి ప్రతీ ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు లబ్ధిదారులతో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అవినీతి రహిత పరిపాలనను అందిస్తున్నామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం నేరుగా ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఏటీ అగ్రహారంలో టీఆర్‌టీఎస్ ప్రాజెక్టు నిర్వాసితులు తమ ఆర్‌అండ్‌ఆర్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రులతో చర్చించి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం – ఎమ్మెల్సీ పెనుమత్స

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను శత శాతం నెరవేర్చడంతో గ్రామాల్లో ప్రజల వద్ద ధైర్యంగా తిరుగుతున్నామని అన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా జగనన్న ఉన్నారనే భరోసా ప్రజల్లో కలిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, సీనియర్ నేత మత్స సత్యనారాయణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, సర్పంచ్‌లు పప్పల భాస్కరరావు, మీసాల సూర్యకంతం, ఎంపీడీవో గిరిబాల, తహసీల్దార్ శైలజ, ఈవోపీఆర్‌డీ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

'పీఎం స్వనిధి'తో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- నగర మేయర్ విజయలక్ష్మి



చిరు వ్యాపారులను అభినందిస్తున్న నగర మేయర్, అధికారులు తదితరులు

విజయనగరం: ప్రభుత్వం అందిస్తున్న పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. మెప్మా ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన పీఎం స్వనిధి అవగాహన కార్యక్రమంలో పథకాన్ని వినియోగించుకుని ఆర్థికంగా లబ్ధి పొందిన పలువురు చిరు వర్తకులకు జ్ఞాపకలిచ్చి అభినందించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితి నుంచి బయటపడ్డ వీధి విక్రయదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఇందులో భాగంగానే పీఎం స్వనిధి, వైఎస్సార్ చేయూత వంటి పథకాలను వర్తింపజేస్తూ ఆర్థికంగా సహాయాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా నగరంలో 3,382 మందికి 10వేల రూపాయలు చొప్పున, 466 మందికి 20 వేల చొప్పున, 44 మందికి 50 వేల రూపాయలు చొప్పున ఇప్పటికే రుణాలు అందివ్వడం జరిగిందన్నారు. సకాలంలో, సక్రమంగా రుణాలు చెల్లించిన వారికి అభినందనలు తెలిపారు. కమిషనర్ శ్రీరామలునాయుడు మాట్లాడుతూ నగరంలో చిరు వ్యాపారస్తులు అనేక మంది ఉన్నారని అయితే కొంతమందికే ఆర్థిక రుణాలు అందాయని మిగిలిన వారిని గుర్తించి వారికి కూడా ఆర్థిక ఆసరా పథకాలు వర్తింప చేసే విధంగా సమర్థవంతమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. రుణాలను పొంది తద్వారా వ్యాపారాలను మెరుగుపరుచుకుని సకాలంలో రుణాలు చెల్లించి మరింత ఆర్థిక బలోపేతానికి బాటలు వేసుకోవాలని చిరు వ్యాపారస్తులకు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, మెప్మా పీడీ సుధాకర్ రావు, నాబార్డ్ జీఎం నాగార్జున, ఎల్‌ఈఎం శ్రీనివాసరావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, చిరు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో కౌన్సిల్ సమావేశాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఆల్తిపాలెం గ్రామంలో ఏపీ ఎన్జీవో 21వ కౌన్సిల్ సమావేశాల వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతుల మీదుగా ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు మంగళవారం విడుదల చేయించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్న కౌన్సిల్ సమావేశాలకు ఉద్యోగులంతా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, సీనియర్ నేత మత్స సత్యనారాయణ, ఏపీ ఎన్జీవో తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు గణేష్, రమణ, కోశాధికారి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన మైలపల్లి ఆరాధ్య మైనర్ గార్డియన్ తల్లి మైలపల్లి ఆదిలక్ష్మి వురఫ్ కరుణ, అకులపేట గ్రామం, డెంకాడ మండలం, విజయనగరం జిల్లా, వారు ఇచ్చిన భోగట్టాపై, పురప్రజలకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా. ఈక్రింది షెడ్యూల్ దాఖలా భూమి యందు, నా క్లయింటుకు వారసత్వపు ఉమ్మడి హక్కు కలదు. ఇట్లుండగా సదరు భూమిలో గల ఉమ్మడి వారసత్వపు వాటా కోసం తన తండ్రి గారైన మైలపల్లి ప్రసాద్ వురఫ్ కరుణబాబు, మరియు అతని సోదరుడిపై, పంపకపు దావా O.S. 289/21, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు (మొబైల్ కోర్టు) విజయనగరం నందు, దాఖలు చేసియున్నారు. కాగా సదరు దావా పెండింగ్‌లో ఉండగా, సదరు భూమి, ఇతరులకు విక్రయింపరాదని I.A దాఖలు చేయడమైనది. ఇట్లుండగా నా క్లయింటు తండ్రి అయిన మైలపల్లి ప్రసాద్ వురఫ్ కరుణబాబు, అతని సోదరుడు ఈ క్రింది షెడ్యూల్ భూమిని, నా క్లయింట్‌ను, నష్టపరిచే ఉద్దేశ్యముతో, సదరు పైన తెలియజేసిన దావా మరియు I.A, పైన తెలిపిన కోర్టులో, పెండింగ్‌లో ఉండగా, ఇతరులకు (థర్డ్ పార్టీస్)కు విక్రయించుటకు ప్రయత్నిస్తున్నట్లుగా, నా క్లయింటుకు తెలియవచ్చినది. కావున సదరు ఈ క్రింది తెలియజేసిన భూమి కొరకు, సదరు నా క్లయింటు తండ్రి గారైన మైలపల్లి ప్రసాద్ వురఫ్ కరుణబాబుతో, మరియు అతని సోదరునితో, క్రయ విక్రయ లావాదేవీలు జరుపరాదనియు, ఒకవేళ జరిపిన యెడల అటువంటి లావాదేవీలు చెల్లనేరవనియూ మరియు నా క్లయింటును బంధింపజాలవనియూ ఇందు మూలముగా పురప్రజలకు తెలియజేయడమైనది.

షెడ్యూల్: విజయనగరం జిల్లా, డెంకాడ మండలం, జొన్నాడ గ్రామం. సర్వేనెంబరు. 165/17లో 29 సెంట్లు, 146/8లో 7 సెంట్లు మెట్టు, 146/1లో 45 సెంట్లు మెట్టు, 145-6/ఎబిలో 19 సెంట్లు, 145-6/ఎఎలో 1 ఎకరా జిరాయితీ మెట్టు మరియు అందు గల నానాజాతి వృక్ష సంపద.

సం/- **రాంభట్ల రమణారావు,** అడ్వకేట్
గుంటూరు వారి వీధి, విజయనగరం.
సెల్: 9440878893

తేది. 09.08.2023